


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సైరంధ్రి

**"తెల్లచీరలో రంభలా ఉన్నారండీ"**

వెనకనించి వినిపించిన ఆ ప్రశంసకి తలతిప్పి చూసిన రేణుక సిగ్గుతో కుంచించుకుపోయింది.

భర్త కొలీగ్ దివాకర్ వెకిలిగా నవ్వుతున్నాడు.

ఆమె చకచకా కిచెన్‌లో పనులతో సతమతమవుతున్న కమల దగ్గరికి వెళ్ళి అడిగింది.

"నేనేమైనా హెల్ప్ చేయనా?"

"ఇప్పటిదాకా చేసావుగా చాలు. వెళ్ళి కూర్చో" అప్పడాలు వేయిస్తున్న కమల అలసటగా నవ్వింది.

"లేదు. నీ దగ్గరుండి కబుర్లయినా చెప్తాను. ఐనా రాంబాబుగారు పాతికమందిని భోజనానికి పిలిచేస్తే ఎలా? నీ గురించి ఆలోచించాలిగా? పోనీ సాయం చేస్తారా అంటే అదీలేదు" రేణుక సానుభూతిగా చెప్పింది.

"మా వారికి ఆడవాళ్ళ కష్టాలు తెలియవు రేణుక 'ఇంకో రెండు వంకాయలు కొయ్యడమేగా? ఇంకో గ్లాస్ బియ్యం ఎక్కువ వండటమేగా' అంటారు. కానీ ఎంత పనో అర్థం చేసుకోలేరు"

రేణుకకి తన భర్త శ్రీహరి గుర్తొచ్చాడు. అలాంటి మనస్థత్వమే. మీ కొలీగ్ దివాకర్ నన్నిలా అన్నాడని చెప్తే అతని తక్షణ స్పందన ఎలా ఉంటుందో రేణుకకి తెలుసు. 'నువ్వేం రెచ్చగొట్టావో! నువ్వు చనువివ్వకపోతే వాడు అంత ధైర్యంగా ఆ మాట అనడు' అందుకే రేణుక భర్తతో ఆ విషయం చెప్పదల్చుకోలేదు.

"రేణూ ఎందుకలా ఉన్నావు? ఏమైంది?" కమల అడిగింది.

"ఇంత హడావిడిలో కూడా నా ఫీలింగ్స్‌ని బాగా అర్థం చేసుకున్నావు" రేణుక నవ్వింది.

"ఏమైందో చెప్పు. ఎవరైనా ఏమైనా అన్నారా?"

"లేదు. రేపు ఫోన్ చేస్తాను. ఇప్పుడువద్దు. నేను నీతోనే కిచెన్‌లో ఉంటాను. నన్ను బయటకి పొమ్మనద్దు."

అర్థం చేసుకున్న కమల రెట్టించలేదు.

హాల్లో మగవాళ్ళ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని మందు పార్టీ చేసుకుంటుంటే వారి భార్యలు సోఫాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలు టి.వి ముందు కూర్చుని సాహో సినిమా చూస్తున్నారు.

రాంబాబు వేయించిన జీడిపప్పు కులాసాగా నోట్లో వేసుకుని అడిగాడు. "మంచింగ్‌కి ఇంకేమైనా కావాలా? కమ్లా. పల్లీలు వేయించి ఉప్పూకారం చల్లిస్తావేంటి?"

"వద్దొద్దు. చాలా స్నాక్స్ ఉన్నాయ్" ఓ కొలీగ్ చెప్పాడు.

"అవునవును. ఇంకా అన్నం కూడా తినాలి" మరొకతను చెప్పాడు.

మంచినీళ్ళకోసం వంటగదిలోకి వచ్చిన దివాకర్ భార్య చెప్పింది.

"నెక్స్ట్ గెట్ టు గెదర్ మీ ఇంట్లోనే రేణుకగారు."

"ఎవరు చెప్పారు?" రేణుక చురుగ్గా అడిగింది.

"మా వారు చెప్తే, శ్రీహరి అన్నయ్యగారు సరే అన్నారు."

"శ్రీహరిగారు అనచ్చు. మధ్యలో ఈ అన్నయ్యగారు ఎందుకు?" చిరాగ్గా అడిగింది.

దివాకర్ భార్య నవ్వుతూ చెప్పింది. "మా వారు ఆయన ఫ్రెండ్స్ అందర్నీ అన్నయ్య అనే పిలవమంటారు. ఆయనకి స్నేహితులంటే అంత అపేక్ష" గ్లాస్ సింక్‌లో పెట్టి ఆమె వెళ్ళిపోయింది.

'దరిద్రుడు' రేణుక గొణిగింది.

"నిను ఏమైనా అన్నాడా?" కమల అడిగింది.

"నువ్వేం చేసావు?" రేణుక వెంటనే అడిగింది.

"ఏం చేస్తాను. నోరు మూసుకుని ఊరుకున్నా. ఈయనకి చెప్తే ముందు నన్ను ఇంట్లోంచి గెంటేస్తారు" కమల కోపంగా చెప్పింది.

"వీడి పెళ్ళానికి అందరూ అన్నగార్లు. వీడికి వాళ్ళ పెళ్ళాలు రంభలు! ఛీ"

రేణుక మొహం ఎర్రబడింది.

"ఈసారి గెట్ టు గెదర్ మనింట్లోనే" ఆ రాత్రి శ్రీహరి చెప్పాడు.

"నాకు ఓపిక లేదు. నేను చేయలేను" విప్పిన బట్టలు బాల్కనీలో ఆరేస్తూ రేణుక చెప్పింది.

"నేను మాట ఇచ్చేసాను. ఈసారికి ఇలా కానీయ్"

"ఎవరికి మాట ఇచ్చారు? ఇచ్చేముందు నన్ను అడగక్కర్లేదా?" రేణుక విసురుగా అడిగింది.

"ఏంటి నిన్నడిగేది? ఎవరికైనా పెట్టాలంటే ఏడ్చి చచ్చిపోతావ్. నీ బాబు సొమ్ముకాదు. నా సొమ్మేగా" శ్రీహరి అరిచాడు.

"ఇంకాస్త సొమ్ము ఖర్చు చేసి వాళ్ళని ఏ హోటల్‌కో తీసుకు పొండి. నేనైతే చేయను. ఎవరికైనా పెట్టాలంటే ఏడ్చి చచ్చిపోతాను" గట్టిగా చెప్పి అటు తిరిగి పడుకున్న రేణుక, కూతురు ఇంట్లో లేనందుకు సంతోషపడింది.

"ఈ తరం అమ్మాయిలైతే అక్కడే వాడిని చెప్పుతీసుకుని కొట్టేవాళ్ళు. లేదా వాళ్ళాయనకి తెలిస్తే వాళ్ళు కొట్టేవాళ్ళు. మన తరం వాళ్ళకే ఈ మొహమాటాలు. భర్త సపోర్ట్ లేకపోవడాలు" కమల విరక్తిగా చెప్పింది.

"అవును. అందుకే వాడు అలా రెచ్చిపోతున్నాడు" రేణుక కసిగా చెప్పింది.

"సరే ఆయన ఆఫీస్‌నించి వచ్చే టైమైంది. ఫోన్ పెటేస్తాను. ఏం చేస్తాం? దుష్టులకి దూరంగా ఉందాం" కమల ఫోన్ పెట్టేసింది.

శ్రీహరి ఏం చేయలేక ఓ మధ్య తరగతి రెస్టారెంట్‌లోని కాన్ఫరెన్స్ రూంలో పార్టీ ఏర్పాటు చేసాడు. రేణుక తలనొప్పి వంక చెప్పి మానేద్దాం అనుకుంది కానీ ఊరినించి వచ్చిన కూతురు 'వెళ్దామమ్మా' అని బతిమాలడంతో తప్పలేదు. కావాలని నల్లరంగు చీరని కట్టుకు వెళ్ళింది. దివాకర్‌కి వంటరిగా దొరక్కుండా కమలని అంటిపెట్టుకుని తిరిగింది.

భోజనాల దగ్గర కూతుర్ని స్వీట్ తినమని బతిమాలుతుంటే దివాకర్ చెప్పాడు.

"మైగాడ్ మీకు ఇంత కూతురుందని ఎవరైనా చెపితె నమ్మేవాడినికాదు."

అతనివంక చురుగ్గా చూసి అక్కడినించి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఇంటికి వచ్చాక చూస్తే దివాకర్‌నించి ఫేస్ బుక్ రిక్వెస్ట్ వచ్చింది. ఓ క్షణం తటపటాయించి ఏక్సెప్ట్ చేసింది.

ఊరినించి వచ్చిన కూతురు మళ్ళీ హాస్టల్‌కి వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం భర్తతో కబుర్లు చెప్తూ ఫోన్‌లోకి చూసి చిరునవ్వు నవ్వింది.

"ఎవరు? బేబీనా?" శ్రీహరి అడిగాడు.

"కాదు. మీ ఫ్రెండ్ దివాకర్. మొన్న పార్టీలో నల్ల చీరకట్టుకున్నా కదా! ఆ రంగువల్ల నా పచ్చటి రంగు హైలైట్ అయిందిట" నవ్వింది.

శ్రీహరి మొహం ఎర్రబడింది.

"వాడికి నీ నంబర్ ఎందుకిచ్చావ్?"

"నంబర్ ఇవ్వలేదు. ఫేస్‌బుక్‌లో పర్సనల్ మెసేజ్ ఇచ్చాడు. మీరెప్పుడూ నన్ను అసలు మెచ్చుకోలేదు" అతని భావాలు గమనించనట్లుగా చెప్పింది.

శ్రీహరి ఆమె చేతిలోని ఫోన్ లాక్కుని చూసాడు.

"మీకు పద్దెనిమిదేళ్ళ కూతురుందని ఎవరూ అనుకోరు. నిజం చెప్పాలంటే మీ అమ్మాయికి మీ అందం రాలేదు. శ్రీహరిని చంపేయాలనిపిస్తోంది. లక్కీఫెలో.'

ఇంకా చాలా మెసేజెస్ తెలుగులో ఉన్నాయి. దేనికీ రేణుక నించి రిప్లై లేదు.

"నాకెందుకు చెప్పలేదు?" కోపంగా అడిగాడు.

"నేనూ ఇప్పుడే చూసాను. ఇన్నిరోజులూ బేబీతో సరిపోయింది నాకు. ఫోన్ మొహమే చూడలేదు" రేణుక అమాయకంగా చెప్పింది.

శ్రీహరి ఫోన్‌ని టీపాయ్ మీద పడేసి చెప్పాడు.

"రాస్కెల్!"

"ఎంతైనా ఏభైఏళ్ళ వయసులో ప్రశంసలు బావుంటాయి. డిలీట్ చేస్తున్నాలెండి. వాళ్ళావిడ మిమ్మల్ని అన్నయ్యగారు అని అంత గౌరవంగా పిలుస్తూంటే అయన నాకు ఇలా మెసేజ్‌లు పంపడం నాకూ నచ్చలేదు" రేణుక ఫోన్ అందుకుంది.

"సారీ దివాకర్. మీ ఇంట్లో డిన్నర్‌కి రాలేం. మీ చెల్లాయ్‌కి వంట్లో బాలేదు. తలనొప్పట. మా చెల్లాయ్‌ని ఏమీ అనుకోవద్దని చెప్పు"

ఫోన్‌లో శ్రీహరి మాటలు విన్న రేణుక విజయగర్వంతో నవ్వుకుంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments